సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులుగా రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 2 3 4 తేదీల్లో సిఐటియు రాష్ట్ర16వ మహాసభల్లో జిల్లా నుంచి రాష్ట్ర కమిటీ సభ్యులుగా అబ్బవరం రామాంజులు, పంచాయతీ కార్మికుల సంఘం నుంచి జిల్లాకు చెందిన డి.వెంకట్రామయ్యలను ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సి.హెచ్.చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామాంజులు మాట్లాడుతూ జిల్లా ప్రధానకార్యదర్శిగా, రాష్ట్ర కమిటి సభ్యునిగా సంఘం నా మీద ఉంచిన భాధ్యతను కార్మిక వర్గ ప్రయోజనాల కోసం రాజీ లేని పోరాటాలకై మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. సిఐటియు లక్ష్య సాధనకై ఐక్య పోరాటాలతో పాలకుల తీవ్ర నిర్బంధాలను గట్టి ప్రతిఘటనలతో ఎదర్కొంటామన్నారు.

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

మదనపల్లె : భిక్షాటన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలనీ, హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, నరసింహలు మాట్లాడుతూ కరువుకు నిలయమైన రాయలసీమ జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలకు సంబంధించిన వేలాది మంది విద్యార్థులు సంక్షేమ హాస్టల్లో విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. ఒకవైపు ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ వసతి గృహాలు అభివృద్ధి చేస్తామని చెబుతూ మరొకవైపు సంక్షేమ హాస్టల్స్ నడ్డి విరిచేటువంటి ప్రయత్నం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. 2018లో గత ప్రభుత్వం అందిస్తున్న మెస్, కాస్మోటిక్ చార్జీలు నేటికీ కొనసాగించడం సబబు కాదన్నారు. కొన్ని హాస్టళ్లలో కనీసం తాగడానికి మంచినీరు, టాయిలెట్, నాణ్యమైన భోజనం లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని, విద్యార్థులకు ఇవ్వవలసినటువంటి బెడ్‌షీట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంకు పెట్టెలు, వెంటనే పంపిణీ చేయాలని, విద్యార్థులు చదువుకోవడానికి అవసరమైనటువంటి అన్ని వసతులు కల్పించాలని, సంక్షేమ హాస్టల్లలో నాడు-నేడు పనులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు కనుకూలంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, లేనిపక్షంలో విద్యార్థుల్ని కలుపుకొని పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ మరిన్ని పోరాటాలకు శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.గణేష్, మదనపల్లి ఎస్ఎఫ్ఐ నాయకులు జయ బాబు, నాని పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** పెరిగిన నిత్యావసర ధరలకు అనుకూలంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. గురువారం పాత బస్టాండ్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నారాయణ, అఖిల్, సుభాన్, శివ పాల్గొన్నారు.

'ఉగాదికి ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు'

ప్రజాశక్తి- రాయచోటి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు-పేదలందరికీ పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి, ఉగాదికి ఐదు లక్షలు ఇళ్లు పూర్తి చేయాలని కలెక్టర్లను చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్ రెడ్డి ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక, హౌసింగ్, విలేజ్, వార్డ్ సెక్రటేరియట్ గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం, వివిధ ప్రభుత్వ పథకాల అమలు పై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సెక్రటరీ సమీక్షించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష్ పిఎస్, డిఆర్ఒ సత్యనారాయణ, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగాచీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఈ క్రాప్ బుకింగ్ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా శత శాతం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న రైతులందరికీ పిఎం కిసాన్ పథకం వర్తించేందుకు రైతుల నుంచి ఇకెవైసి తప్పకుండా వేయించాలని సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో భాగంగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అర్హుల ఎంపిక, పరికరాల అమరికపై పూర్తి లక్ష్యం పెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ మేలు చేస్తూ వారి ఆరోగ్యం కోసం అధిక పోషక విలువలు గల చేపలు అందుబాటులోకి తేవాలని చెప్పారు. డొమెస్టిక్ మార్కెటింగ్ లో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించేందుకు జిల్లాలో ఆక్వా హబ్‌లు, ఫిష్ వెండింగ్, రిటైల్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్ఆర్ చేయూత పథకం కింద జీవనోపాధి కోసం రుణాలు ఇప్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు పూర్తిపై అధికారుల ప్రత్యేక శ్రద్ధ పెట్టి స్టేజ్ కన్వర్షన్ మీద ఫొటోస్ పెట్టాలని సూచించారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ రహదారుల పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, డిఆర్ఒ

గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల్లో మెరుగైన పనితీరు, సమగ్ర పర్యవేక్షణ ఉండాలన్నారు. సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలో సచివాలయాల కీలక పాత్ర పోషించాలన్నారు. సుస్థిర ప్రగతి లక్ష్యాలపై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే ఆ లక్ష్యాలను అందుకోగలుగుతామన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ మత్స్య సంపద యువతలో స్వయం ఉపాధి కోసం 'ఫిష్ ఆంధ్ర మినీ ఫిష్ రిటైల్ ఔట్లెట్'లు ప్రతి మండలంలో ఒకటి చొప్పున ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎం పీడీని కలెక్టర్ ఆదేశించారు. రబీ సీజన్ ఈ క్రాప్ బుకింగ్, పీఎం కిసాన్ ఇకెవైసి మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులు గ్రౌండింగ్ పురోగతి కనిపించాలని సూచించారు.

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ రహదారుల పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రవాణా రోడ్లు, భవనాల శాఖ ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న పి.ఎస్. అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలను ఆదేశించారు. గురువారం అన్ని జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారులు పనులకు సంబంధించిన భూ సేకరణపై అన్ని జిల్లాల కలెక్టర్‌లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్లో మినీ విసీ హాల్ నుంచి కలెక్టర్ గిరీష పిఎస్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యదర్శి మాట్లాడుతూ అన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న ఎన్‌హెచ్‌ఎఐ, ఎన్‌హెచ్ పనులకు సంబంధించి ఇంకా భూ సేకరణ పెండింగ్ ఉన్న చోట పూర్తి చేయాలన్నారు. అందులో భాగంగా జాతీయ రహదారుల భూసేకరణ సంబంధించి ఎన్ని హెక్టార్లు భూసేకరణ చేశారు, ప్రభుత్వ, ప్రయివేటు భూమి ఎంత సేకరించారు. ఇంకా ఎంత సేకరించాల్సి ఉంది వంటి వివరాలను అడిగి తెలుసుకుని 3ఏ, 3డీ, 3జి అవార్డు పెండింగ్ లేకుండా ఈ ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు .అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారుల కోసం భూసేకరణ సంబంధించి 656.50 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. ఇందులో 350.094 హెక్టార్ల ప్రభుత్వ, ప్రయివేట్ భూమి హ్యాండ్ ఓవర్ చేశామని చెప్పారు. మిగిలిన భూమిని భూసేకరణ త్వరగా చేయాలని సూచించారు. 3ఏ, 3డీ, 3జి అవార్డు పెండింగ్ లేకుండా ఈ ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో ఎవరైనా కోడిపందేలు, పేకాట, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు అన్నారు. గురువారం ఆయన ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో ఇప్పటికే పేకాట, కోడి పందేలు, అసాంఘిక కార్యక లాపాలు నిర్వహించే స్థావరాలను గుర్తించా మన్నారు. ఆ ప్రదేశాలలో పోలీస్ నిఘా ఉంటుం దన్నారు. జిల్లాలో గతంలో కోడి పందేలలో పాల్గొన్న వారిని గుర్తించి మళ్లీ ఆడకుండా చర్యలు తీసుకుం టున్నామని చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెవెన్యూ అధికారుల ఎదుట బైండోవర్ చేసి కఠిన చర్యలు చేపట్టామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని, పేకాట, కోడి పందే లు, ఇతర అసాంఘిక కార్యకలాపాలలో ఎవరైనా పాల్గొంటే వారిని ఉపేక్షించేది లేదని అన్నారు .బైండోవర్ చేసిన వారిని న్యాయస్థానం ఎదుట హాజరు పరిచి చట్టపరంగా శిక్షలు విధించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేలు, పేకాట వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొన్న వ్యక్తుల ఆర్థికంగా నష్టపోతారని, తద్వారా కుటుంబ కలహాలు వస్తుంటాయని చెప్పారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బత్యాల, నాయకులు

చీకటి జిఒను రద్దు చేయాలి : టిడిపి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిఒ నెంబర్1ని వెంటనే రద్దు చేయాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబు నాయుడుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు డిమాండ్ చేశారు. కుప్పంలో చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకోవడంపై గురువారం పట్టణంలో నిరసనగా ర్యాలీ నిర్వహించారు. టిడిపి కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోకి రాగానే పట్టణ సిఐ నరసింహారావు ర్యాలీకి అనుమతి లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. నాయకులు పట్టించుకోని ర్యాలీని ఆర్అండ్‌బి బంగ్లా వరకు కొనసాగించారు. అక్కడున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిఒ నెంబర్1 ప్రతులను చింపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటనను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గపుచర్య అని మండిపడ్డారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగ్గురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-గుర్రంకొండ

జగనన్న పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించలేదని ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసును ఇచ్చామని ఎంపిడిఒ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ సచివాలయం-1 కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, గుర్రంకొండ సచివాలయం-2 కార్యదర్శి నిషార్ అహ్మద్, కండ్రిక పంచాయతీ కార్యదర్శి మనికుమార్‌లకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ నెల నాలుగో తేదీన గుర్రంకొండ సచివాలయంలో కొత్త పింఛన్ల కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జడ్‌పిటిసి, ఎంపిపిని ఆహ్వానించకుండా ప్రోటోకాల్ పాటించలేదని చెప్పారు. ఎందుకు ఆహ్వానించలేదు, ప్రోటోకాల్ పాటించలేదని రెండు రోజుల లోపల వివరణ ఇవ్వాలని నోటీసులిచ్చామన్నారు.

అనుమానాస్పద స్థితిలో నెమలి మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అనుమానాస్పద స్థితిలో నెమలి మృతి చెందిన సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకొంది. గొర్రెల కాపరుల సమాచారం మేరకు.. పట్టణ సమీపంలోని గొల్లపల్లి రోడ్డులోని అటవీ ప్రాంతంలో నెమళ్లు సంచరిస్తుంటాయి. పలుమార్లు రోడ్లపైకి కూడా వస్తుండడంతో చుట్టుప్రక్కల పొలాల రైతులు అటవీ ప్రాంతాల్లోకి తరిమేసేవారు. గుర్తు తెలియని వేటగాళు నెమళ్లపై దాడులు చేయడంతో ఓ నమెలి మృతి చెందినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. అటువైపుగా వెళ్తున్న గొర్రెల కాపరులను చూసి దుండగులు పరారైనట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు నిద్రమత్తులో జోగుతుండడంతో నెమళ్లపై దాడులు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు నెమళ్లపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గొల్లపల్లి వద్ద మృతి చెందిన నెమలి

ఎంఎల్‌హెచ్‌పి బదిలీల్లో గోల్‌మాల్!

- ఉత్సవ విగ్రహాలుగా ఆర్‌డి ఆఫీసు సూపరింటెండెంట్లు
- ఖాళీల జాబితాను విస్మరించి పోస్టింగులపై విమర్శలు
- 15 నుంచి 20 మంది అరైవల్ స్థానాల్లోకి
- కమిషనరేట్‌కు ఫిర్యాదు బాటలో యూనియన్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప రీజియన్ పరిధిలోని మల్టీ లెవల్ హెల్త్‌ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పి) ఉద్యోగుల బదిలీల, నియామకాల్లో గోల్‌మాల్ కథ నడుస్తోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగుల బదిలీలను పెద్దఎత్తున చేపట్టిన సంగతి తెలిసిందే. కడప రీజియన్ పరిధిలోని 3,106 మంది ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగుల్లో అర్హుల బదిలీలను ఏడు బ్యాచ్‌లుగా విభజించింది. మెరిట్స్, సీనియారిటీ, సీరియల్స్, ర్యాంకుల ఆధారంగా బదిలీలకు శ్రీకారం చుట్టింది. గతేడాది డిసెంబర్ 15న కడప రీజియన్ పరిధిలో సుమారు 324 మంది ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగుల బదిలీల ప్రక్రియను నిర్వహించింది. ఇందులో 240 మంది ఉద్యో గులను మాత్రమే మ్యాపింగ్ చేసింది. వేకెన్సీ స్థానాల నోటీస్‌ను విడుదల చేసింది. ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగులు వేకెన్సీ స్థానాలకు బదిలీలు కోరుకోవాల్సి ఉంది. ఆచరణలో ఆర్‌డి కార్యాలయం వేకెన్సీ నోటీస్ లో పేర్కొన్న నింబధనలకు వ్యతిరేకంగా బదిలీల తంతును యథేచ్ఛగా సాగించడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. ఉదాహరణగా చిత్తూరు జిల్లా రామకుప్పం పిహెచ్‌సి స్థానంలో రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్న స్వాతి అనే ఎంఎల్‌హెచ్‌పి స్థానానికి డిసెంబర్ 17న ఎనిమిదవ బ్యాచ్ కింద నియామకాలు చేపట్టింది మెరిట్, సీరియల్ నెంబర్ 13వ స్థానం, 134 మెరిట్ ర్యాంకు కలిగిన కవితను బదిలీ చేశారు. డిఎంహెచ్‌ఒ, ఆర్‌డి కార్యాలయ ఉన్నతాధికారులు నోటీస్‌లోని స్థానాలకు విరుద్ధంగా అరైవల్ స్థానానికి నియామకం చేయడంలోని ఉద్దేశమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. కేవలం పొరపాటు కారణంగా చోటుచేసుకుందా, ఉద్దేశపూర్వకంగా చోటుచేసుకున్న ఘటనా అనేది విచారణ చేపడితే తేలనుంది. బదిలీ జాబితాలోని ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగులకు డిఎంహెచ్‌ఒ, ఆర్‌డి కార్యాలయాల నుంచి ఫోన్‌లు చేయడంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. బదిలీలు, నియామకాల వ్యవహారంలో ఉద్యోగ సంఘాల నాయకులను నియమించుకోవడం వల్ల పారదర్శకత ప్రశ్నార్థకంగా మారుతోందనే వాదన కొంతకాలంగా వినిపిస్తోంది. రీజియన్ పరిధిలోని ఆయా డిఎంహెచ్‌ఒల పరిధిలో పిహెచ్‌సి, రూరల్, సబ్‌సెంటర్ స్థానాల్లో ఎంఎల్‌హెచ్‌పి స్థానాల ఖాళీ లెన్ని ఉన్నాయో డిఎంహెచ్‌ఒ, పిహెచ్‌సి వైద్యులకు తెలియకుండా ఉంటుందా అనే సందేహం వ్యక్తమవుతోంది. అరైవల్ స్థానాల ఎంఎల్‌హెచ్‌పి నుంచి బదిలీలపై వ్యతిరేకత వ్యక్తం కావడంతో కొత్తగా బదిలీపై వెళ్లిన ఎంఎల్‌హెచ్‌పిలు డిఎంహెచ్‌ఒ, ఆర్‌డి కార్యాలయాల చుట్టూ తిరగడం, వారిని కోర్టుకు వెళ్లాల్సి ఉంటుందనే హెచ్చరికలు చేయడం భయాందోళనకు గురి చేసి వసూళ్ల పర్వానికి పాల్పడుతున్నారనే వాదన వినిపిస్తోంది. డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో బదిలీలు, నియామకాల కౌన్సెలింగ్ ముగిసింది. మోడిఫికేషన్ ఉత్తర్వుల పేరుతో ఆర్‌డి కార్యాలయంలో బేరసారాలు సాగించిన నచ్చిన స్థానానికి బదిలీలు చేస్తున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి. ఇందుకు ఆర్‌డి కార్యాలయంలోని ఇద్దరు సూపరింటెండెట్లను కాదని, జిజిహెచ్ నర్సింగ్ కళాశాలకు చెందిన సూపరింటెండెంట్‌ను నియమించుకుని యథేచ్ఛగా బదిలీల ప్రక్రియ సాగించడం ఆరోపణలకు బలం చేకూరుతోందనే వాదన ఉద్యోగ సంఘాల నుంచి వినిపిస్తుండడం గమనార్హం. ఉమ్మడి కడప జిల్లాలో ముగ్గురు, అనంతపురం జిల్లాలో ముగ్గురు చొప్పున చిత్తూ రు, కర్నూలు జిల్లాలకు వెరసి సుమారు 15 మంది నుంచి 20 మంది ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగులను వేకెన్సీ జాబితా స్థానాల్లోకి బదిలీలు చేయకుండానే అరైవల్ స్థానాలకు బదిలీల ప్రక్రియ నడిచినట్లు సమాచారం. దీనిపై డిఎంహెచ్‌ఒ యూనియన్ నాయకులు కమిషనరేట్‌కు ఫిర్యాదు చేసే ఆలోచనల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

పొరపాట్లను సరిదిద్దుతాం

ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో పొరపాట్లు చోటుచేసుకున్నాయని గుర్తించాం. వాటిని త్వరలోనే సరిదిద్దుతాం. డిఎంహెచ్‌ఒల నుంచి అందిన ఖాళీల ప్రకారమే బదిలీలు చేశాం.

- డాక్టర్ కోటేశ్వరి, ఆర్‌డి, కడప.

వైసిపికి రోజులు దగ్గరపడ్డాయ్ : ఆర్ఆర్

కొత్తపల్లిలో చెత్తను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

వైసిపి ప్రభుత్వానికి ఇంటికి వెళ్లే రోజులు దగ్గరపడ్డాయని, జగన్ రెడ్డి అరాచక పాలనతో రాష్ట్ర ప్రజలు ఇప్పటికే విసిగిపోయి ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం పార్టీదే అధికారం అని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి ప్రాంతం 8వ వార్డు టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కొత్తపల్లి ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి గడిచిన మూడు సంవత్సరాలలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక,రైతు వ్యతిరేక కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని పేర్కొన్నారు. మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులు ఏమీ కొని, తినలేని పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు.నిత్యావసర సరుకులతో పాటు గ్యాస్ ధరలు, విద్యుత్, ఆర్టీసీ ఛార్జీలు ఇలా ప్రతి ఒక్కటి పెరిగిపోయి సామాన్యుల నడ్డి విరుస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని ఏ వర్గానికీ ఈ ప్రభుత్వం న్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి రాష్ట్ర ప్రజల సిద్ధంగా ఉన్నారని ఆయన జోష్యం చెప్పారు. రాయచోటి మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా డ్రెయినేజీలు చెత్తాచెదారంతో నిండిపోయి కంపు కొడుతున్నాయని వాపోయారు. సిమెంట్ రోడ్లన్నీ గుంతల మయంగా మారి ప్రజలు తీవ్ర అసవకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలీ, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఎస్.కే.హుస్సేన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, టిడిపి నాయకులు రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి వతన్ నిస్సార్, నియోజకవర్గ మైనార్టీ సేల్ ప్రెసిడెంట్ వతన్ సలీమ్, ఎద్దుల లక్ష్మీ ప్రసాద్, మన్సూర్, సోనిరాజ్ కలిమ్, అత్తర్ జావిద్, శేషిజాబీర్, సయ్యద్, మహమ్మద్ జాఫర్, మాజీ కౌన్సలర్ మహబూబ్, ఫయాజ్ బాడీ బిల్డర్, షబ్బీర్ అహ్మద్, సయ్యద్ ఫజిల్, సాయి, న్యూ ఆంధ్రముబారక్, టీడీపీ రాయచోటి మైనార్టీ యూత్ ప్రెసిడెంట్ సాహుద్ బాష, మైనారిటీ మహిళ నాయకురాలు నసీబ్ జాన్, శివారెడ్డి, రాజ రెడ్డి రెహ్మాన్, ముబారక్, సయ్యద్ ఖాన్, రెడ్డిబాష, ఫయాజ్, అలీ, ముబారక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పేదల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బాధితులకు సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు అందని వారికి సిఎం సహాయ నిధి నుంచి నగదు అందిస్తున్నామన్నారు. వెయ్యి దాటితో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. అనంతరం ఇద్దరు బాధితులకు రూ.2.40 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యు సభ్యత్వ నమోదు

రాయచోటి టౌన్ : రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రంలోని పలు జూనియర్ కళాశాలలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద్భంగా ఆర్ఎస్‌యు రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రశాంత్ మాట్లాడుతూ రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థుల పక్షాన నిలబడి వారికి ఏ సమ్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తుందని చెప్పారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చిన విభజన హామీ సాధన కోసం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు జై సింహా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఏర్పాటు పనుల పరిశీలన

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ ముఖ ద్వారం వద్ద 102 అడుగుల స్తంభం పైన జాతీయ జెండా ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. అందుకు సంబంధించిన పనులను గురువారం కలెక్టర్ గిరీష పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జెండా కింద ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన పనులన్నీ త్వరితగతిన చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, తహశీల్దార్ రవి శంకర్ రెడ్డి, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఫలితాలు సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి - రామాపురం

పదవ తరగతి పరీక్షల్లో మండలంలోని విద్యార్థులు వంద ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నమయ్య జిల్లా డీఈవో రాఘవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం బాలయోగి గురుకుల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి నాడు - నేడు పనులపై సమీక్షించారు. పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం బాలయోగి గురుకుల పాఠశాలను వెళ్లి పదవ తరగతి విద్యార్థుల ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు ఇచ్చారు. రోజూ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ రామకృష్ణుడు, ప్రిన్సిపల్ వినయ్‌కుమార్, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది చంద్రశేఖర్, విశ్వనాథ్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఇఒ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డిఇఒ

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అర్హులైన ప్రతి ఒక్కరికి గ్రామ సచివాలయం, వాలంటీరు వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయని మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ బాషా అన్నారు. గురువారం స్థానిక సింగల్ విండో కార్యాలయం వద్ద ఎంపిపి నరసింహులు అధ్యక్షతన నూతనంగా మంజూరైన వైఎస్ఆర్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పింఛనుదారులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సందేశ పత్రం ద్వారా పంపిన సందేశాన్ని అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి దేశంలో వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని అన్నారు. పాదయాత్రలో హామీ ఇచ్చిన మేరకు పెన్షన్ మొత్తాన్ని దశలవారీగా పెంచుకుంటూ వస్తున్నారని, అందులో భాగంగా ప్రతి ఒక్క పింఛను దారునికి ఈ నెల నుంచి 2750 రూపాయలు అందుతుందని తెలిపారు. మండలంలో మొత్తం 5054 పింఛన్లు ఉండగా, ప్రభుత్వం ప్రతినెల 1,41,71,500 రూపాయలు పింఛనులకై చెల్లిస్తోందన్నారు. నూతనంగా మరో 136 మంది లబ్ధిదారులకు పెన్షన్ కానుక అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైసిపి ఇన్‌చార్జ్ ఆర్.ఐ రమణారెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, తాహశీల్దార్ సిఆర్ మంజుల, ఎంపిడిఒ లీలామధవి, ఎస్ఐ ఫాతిమా, సర్పంచులు ఉషారాణి, సుబ్రమణ్యం, మహదేవరెడ్డి, చెంద్రాయుడు, నాయకులు సదా శివరెడ్డి, నరేందర్ రెడ్డి, శశిధర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, నవీన్, చంద్రమోహన్, గంగాధర, రవి, గోపాల పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని ముడియంవారిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న వివిధ రకాలైన పింఛన్లు పభుత్వం మంజూరు చేయడంతో సర్పంచ్ శాంతమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శివాజీ, నాగభూషణం, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొ న్నారు. **నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్‌గ్రామపంచాయతీ పరిధిలోని పెన్షన్ లబ్ధిదారులకు ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, జిల్లా వర్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు కరీముల్లా ఖాన్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, వైస్ ఎంపిపి అనుదీప్, వైసిపి నాయకులు తుమ్మల శ్రీధర్ గౌడ్, నడివీధి సుధాకర్, హిమగిరినాథ్ యాదవ్, ధనుంజయ నాయుడు, మన్సూర్, నవాబ్, విజయుడు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **వీరబల్లి :** పెన్షన్‌వారోత్సవాలలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపిడిఒ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్ఆర్ పెన్షన్ కానుక కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు. వీరబల్లి మండలంలో 5394 మందికి 1,48,33,250 రూపాయలు పెన్షన్‌లు ఇస్తుండగా, కొత్తగా 153 మందికి పెన్షన్లు మంజూరు చేశారని చెప్పారు. మండలంలో ప్రస్తుతం మొత్తం 5394 మందికి 1,48,33,250 రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ మధుసూదన్ రెడ్డి, జడ్పిటిసి శివరాం గౌడ్, తహశీల్దార్ తులసమ్మ, ఎంఇఒ గిరి వరదయ్య, సర్పంచులు, ఎంపిటిసిలు, వైస్ ఎంపిపిలు, బోర్డు మెంబర్లు, డైరెక్టర్లు, చైర్మన్లు, కో-ఆప్షన్ నెంబర్లు పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి చేతుల మీదుగా పెన్షన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ముఖ్య ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు బిఎల్ నరసింహారెడ్డి, జడ్పిటిసి ఇస్మాయిల్, ఎంపిపి రాజమ్మ , మండల మైనార్టీ నాయకుడు రెహ్మాన్ ఖాన్, మండల కో ఆప్షన్ నెంబర్ కలీం భాష, ఎంపిటిసిలు నసీమా భాను, శంకర, ముడుంపాడు సర్పంచ్ రామస్వామి రెడ్డి, పొలిమేరపల్లి సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, రాయవరం సర్పంచ్ షరీఫ్, జిరెడ్డి వారి పల్లి సర్పంచ్ ఆకుల శ్రీనివాసులు, పిఎన్ కాలువ సర్పంచ్ నాగేంద్ర, మండల నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, వీర మల్లయ్య నాయుడు, మధుసూదన్ రెడ్డి, పాపన్న గారి పల్లి బాబురెడ్డి, రాయవరం ఉప సర్పంచ్ ఆకుల శివకుమార్ రాయల్, మడితాడు సర్పంచ్ నాగయ్య, మాచిరెడ్డి గారి పల్లి మాజీ సర్పంచ్ వెంకట రమణ రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకుడు అబ్దుల్లా ఖాన్ ,మాచిరెడ్డి గారి పల్లి రమణారెడ్డి, కృష్ణారెడ్డి, మాచిరెడ్డి గారి పల్లి నరసింహులు నాయక్, యువనాయకులు అలీ, సోషల్ మీడియాకన్వీనర్ సయ్యద్‌సల్మాన్, కోకన్వీనర్ జలీల్, ఖలీల్, సచివాలయం సిబ్బందిపాల్గొన్నారు.



వైఎస్ఆర్ పింఛను చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్ బాషా

ఆడపూరు ముక్తికణం వద్ద రోడ్డు మరమ్మతులు చేపడుతున్న కూలీలు

రూ.80 లక్షలతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-నందలూరు

గతుకుల రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో కొందరుహర్షం వ్యక్తం చేస్తుంటే, మరి కొంతమంది ఈ రోడ్డుకు ఎప్పుడు మరమ్మతులు చేపట్టడమేనా కొత్త రోడ్డు వేయించే నాయకుడే కరువయ్యాడా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోటిన్నర రూపాయలు వెచ్చించి సంవత్సరం క్రితమే మరమ్మతులు చేపట్టినప్పటికీ పూర్తిగా గతుకుల రోడ్డుగా మారిందంటే మన అధికారుల పర్యవేక్షణ లో ఏ విధంగా రోడ్డు వేశారో ఇట్టే అర్థమవుతుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన నందలూరు నుండి టంగుటూరు వరకు 80 లక్షల రూపాయలతో రోడ్డు మరమ్మతుల పనులను ప్రారంభించినట్లు కాంట్రాక్టర్, మండల వైసిపి కన్వీనర్ సిద్ధవరం గోపిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అత్యవసర మరమ్మత్తుల నిధులు కింద ఆర్అండ్‌బి రోడ్డు నందలూరు నుండి టంగుటూరు వరకు 15 కిలోమీటర్లు పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. తాత్కాలికంగా కాకుండా శాశ్వత రోడ్డు ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సచివాలయానికి ఐ స్కానర్ వితరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని నాలుగో సచివాలయానికి ఆ సచివాలయం కన్వీనర్ సి.ఆర్.చిన్నికృష్ణ తన సొంత నిధులతో రూ.5 వేలు విలువచేసే ఐ స్కానర్ ను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా చిన్నికృష్ణ మాట్లాడుతూ పెన్షన్ పంపిణీలో భాగంగా వేలిముద్రలు రాని వృద్ధుల కోసం ప్రస్తుతం ఐస్కానర్ ఒకటే ఉండడంతో సచివాలయ సిబ్బంది, వేరే సచివాలయాలపై ఆధారపడుతూ పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఆలస్యమవుతుందని అన్నారు. పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో తనవంతు సాయంగా ఐ స్కానర్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ శ్రీనివాసులు, కె.జయచంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడును కలిసి పుష్పగుచ్చం అందిస్తున్న హనీఫ్

చంద్రబాబును కలిసిన హనీఫ్

ప్రజాశక్తి-కలికిరి

కుప్పం పర్యటనకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనీఫ్ కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ముస్లిం మైనార్టీ జెఎసి కలికిరి ఆధ్వర్యంలో ఆయన చేసిన పలు సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఇటీవలే ఆయనకు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చొరవతో రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పదవి బాధ్యతలు అప్పగించారు. మూడు రోజులు పర్యటన నిమిత్తం కుప్పం విచ్చేసిన టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడిని కలిసి పుష్పగుచ్చం అందించి దృశ్యాలువతో సత్కరించారు.కార్యక్రమంలో జావీద్, ఖాదర్ వల్లి, జాకీర్, సుబహాన్, అఫ్రిద్, ముబారక్ నాయ కులు పాల్గొన్నారు.

పర్యటనను అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు

ప్రజాశక్తి-కలికిరి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలను అడ్డుకోవాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్ అన్నారు. గురువారం స్థానిక నల్లారి భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఇదేంఖర్మ కార్యక్రమంలో భాగంగా కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబును అడ్డుకోవాలని రాత్రికి రాత్రి నల్ల జీవోలను సృష్టించి విఘాతం కలిగించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకొని జీవో నెంబర్ వన్ ప్రతులను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, పీలేరు నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షుడు అగస్త్రీశ్వర, మండల ఎస్టి సెల్ అధ్యక్షుడు శ్రీనివాస వర్మ, క్లస్టర్ ఇంచార్జ్ రమేష్ శెట్టి, సీనియర్ నాయకులు సహదేవ రెడ్డి, కె.వి.రెడ్డి, వాటర్ షెడ్ రవి, జనార్ధన్‌గౌడ్, జ్ఞానమూర్తి, విజయ్‌కుమార్‌రెడ్డి, ధరణి సత్యరెడ్డి, అక్బర్, భాస్కర్‌రెడ్డి, ముస్త ఫాహజరత్, మహమ్మద్ అలీ, అఫ్రోజ్ భాష, పెద్దన్న, మాజీ జెడ్పిటిసి మాలతి, యువనాయకులు అవినాష్ రెడ్డి, సనావుల్లా, ఇమ్రాన్, రాకేష్, మాజీ సర్పంచ్ అంజమ్మ, ఎల్ఐసి వేణు, నాగరాజ, వెంకటపతి, రెడ్డయ్య, రాంబాబు, మున్వర్,షబ్బీర్, బాబ్జి కార్యకర్తలు పాల్గొన్నారు.

10న వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-రాయచోటి

నెహ్రూ యువకేంద్ర సహకారంతో విఆర్‌డిఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10 వ తేదీన శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గునే వారు 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల లోపు యువకులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా 3000రూపాయలు, ద్వితీయ బహుమతిగా 2000రూపాయల నగదుతో పాటు షీల్డ్, ప్రశంసా పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రుసుము ఉచితమని 9 వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిం చారు. వివరాలకు గౌస్ 8639358797, సురేంద్రారెడ్డి 9490028324 సంప్రదించాలని పేర్కొన్నారు.

వాలంటీర్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ కొత్త గాండ్లపల్లికు చెందిన వాలంటీర్ ఇంజేటి శివప్రసాద్ అకాల మరణం చెందడంతో పలువురు తమ సంతాపం వ్యక్తం చేశారు. బాటవారిపల్లి సచివాలయంలో గ్రామ వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ డయాబెటిస్ వ్యాధితో బాధపడుతూ గురువారం మరణించాడు. ఎంపిపి శ్రీదేవి రవికుమార్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి వైఎస్ఆర్ బీమా, తక్షణ సహాయం కింద దహన క్రియలకు పదివేల రూపాయలను మృతుడి భార్య అశ్వితకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి నందిని, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి-ములకలచెరువు

ప్రాథమిక హక్కులకు భంగం కలిగే చీకటి జిఒ వెంటనే రద్దు చేయాలి టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ర్యాలీలు, సభలు, సమావేశాలు నియంత్రనకు జారీ చేసిన జిఒను ప్రభుత్వం వెంటనేఉపసంహరించుకోవాలన్నారు. నాడు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనకుండా, మన హక్కులను అణచి వేయడానికి 162 ఏళ్ల కిందటి పోలీస్ యాక్ట్ 30, 1861లో బ్రిటిష్ వాళ్ళు పెట్టిన చట్టం ఆధారంగా ఇపుడు వైసిపి ప్రభుత్వం మన రాష్ట్రంలో పెట్టడం వెనుక ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌లను టార్గెట్‌గా పౌర హక్కులు, స్వేచ్ఛకు కట్టడే లక్ష్యంగా ఈజిఒ ఉందన్నారు. రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు, సభలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిందని అన్నారు. పరిపాలనలో లోపాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, ప్రతిపక్షాల, ప్రజాసంఘాల నోరునొక్కే జిఒను తక్షణం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

క్రికెట్ స్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

రెండు నెలల్లో క్రికెట్ స్టేడియం పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో నిర్మించే క్రికెట్ స్టేడియం స్థలాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్ గిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ సమీపంలోని నక్కలవాండ్లపల్లెలో క్రికెట్ స్టేడియం అన్ని హంగులతో నిర్మించడం జరుగుతుందన్నారు. జిల్లాలో నిర్మిస్తున్న క్రికెట్‌స్టేడియం నిర్మాణ పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రెండు కోట్ల రూపాయలతో దాదాపు 25 ఎకరాలలో నిర్మించనున్న ఈ క్రికెట్ స్టేడియాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్టేడియం నిర్మాణ స్థలాన్ని జెసిబితో చదును చేయించి, స్టేడియం చుట్టూ ఫినిషింగ్‌వాల్, ఫ్లడ్ లైట్స్, రోడ్డు వంటి పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, తహసిల్దార్ రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు 'ఉపాధి' భరోసా

ప్రజాశక్తి-వీరబల్లి

గ్రామీణ ప్రాంత ప్రజలకు జాతీయ ఉపాధి హామీ పథకం భరోసాను కల్పిస్తోందని మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా మట్లి సచివాలయంలో గురువారం సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మన గ్రామానికి సంబంధించి 16,17 వ విడత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎలాంటి అవకతవకలు లేకుండా ఉపాధి పనులు జరగడం ఆనందించదగ్గ విషయం అన్నారు. గతంలో లాగే ఉపాధి సిబ్బంది జాగ్రత్తలు చేపట్టి పనులలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని సూచించారు. రైతులకు, కూలీలకు సహకరించి వారికి పనులు కల్పించాలని తెలియజేశారు. ప్రజలు కూడా ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో డిఆర్‌పి అక్కులప్ప, టిఎలు సురేంద్ర రెడ్డి, దామోదర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ బాబు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రభుత్వ భూముల పరిశీలన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలోని తుమ్మనగుట్ట పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ, అసైన్డ్‌భూములను తహశీల్దార్ ధనుంజయులు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను గుర్తించి భూమిలేని నిరుపేదలకు రెండుఎకరాలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి రికార్డులు లేకుండా కొందరు వ్యవసాయం చేసుకుంటున్నారని వారికి ప్రభుత్వం తరపున హక్కుపత్రం అందిస్తామని పేర్కొన్నారు. భూమి లేని ప్రతి పేద వాడికి వ్యవసాయానికి అనువైన భూమిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి భూమిని అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తుమ్మనగుట్ట విఆర్ఒ సంధ్య, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం.. ఆహ్లాదకరం

ప్రజాశక్తి - వేంపల్లె

పచ్చదనం ఆహ్లా దాన్నిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. మండలంలోని పాములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ అధికారుల ఆదేశాల మేరకు వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల పాములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుందన్నారు. పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రం చేసి, పచ్చదనం కోసం మొక్కలు నాటామన్నారు. తమ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం చాలా సంతోషంగా ఉందని ప్రధానో పాధ్యాయుడు శివరాం పేర్కొన్నారు. పరిశుభ్రత, పచ్చదనంపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు విద్యార్థులే అవగాహన కల్పించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధి కారి డాక్టర్ ఓబుల్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతి సొమ్ము కక్కిస్తానంటే స్వాగతిస్తాం

ప్రజాశక్తి - మైదుకూరు

గత ప్రభుత్వ హయాంలో మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో రూ.80 లక్షలు అవినీతి జరిగిందని, ఆ సొమ్మును కక్కిస్తానన్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాటలను స్వాగతిస్తున్నామని టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యా లయంలో గురు వారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రఘురామిరెడ్డి మాటలు దొంగే దొంగ అనే చందంగా ఉందన్నారు. 2014లో టిడిపి ప్రభుత్వం ఉన్నా, ఎమ్మెల్యే మాత్రం రఘురామిరెడ్డేనని తెలిపారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్ల అయినా ఇప్పటికి కూడా ఒక్క పైసా కక్కించని రఘురామిరెడ్డి ఇప్పుడు ఇలా మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. సమా వేశంలో ధనపాల జగన్, దాసరి బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబులేసు పిల్లలను చదివిస్తా..

మండలంలోని అక్కులాయపల్లె గ్రామానికి చెందిన గుర్రం ఓబులేసు పిల్లలను చదివిస్తానని టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. ఓబులేస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం పుట్టా సుధాకర్ యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబులేసు పిల్లలను ఎన్‌టిఆర్ స్కూల్‌లో చదివించేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధనపాల రవి, దాసరి బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తేక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో వెండి పతకం

చాపాడు : బెంగళూరులోని రేయాన్ ఇంటర్నేషనల్ స్కూల్ మైదానంలో నిర్వహించిన 3వ ఓపెన్ ఇంటర్నేషనల్ తేక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక సిబిఐటి కళాశాల విద్యార్థి ఎంపి శైలజ (ఫైనల్ ఇయర్ ఇసిఇ) ద్వితీయ స్థానంతో వెండి పతకాన్ని సాధించింది. ఈ పోటీల్లో 7 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఎపి తరపున ఎంపి శైలజ పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించారు.

పనులను నాణ్యతతో చేపట్టాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందులలో జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను గురువారం వారు పరిశీలించారు. అనంతరం పాత మార్కెట్‌లో జరుగుతున్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

వేంపల్లె : రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను తాత్కాలికంగా నిల్వ ఉంచుకొని, శుభ్ర పరచుకోవడానికి, గ్రేడింగ్ చేసి విక్రయాలు చేసుకునేందుకు పొలాల్లో రైతులు ప్యాక్ హౌస్ నిర్మించుకున్నారు. నిర్మించుకున్న ప్యాక్ హౌస్‌కు బిల్లులు మంజూరు కాలేదు. దీంతో రైతులు బిల్లులు కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మండలానికి 14 ప్యాక్ హౌస్‌లను మంజూరు చేసింది. ఒక్కో పిహెచ్‌ఎం ప్యాక్ హౌస్‌కు రూ.4 లక్షలు మంజూరు కాగా.. రైతు వాటా కింద రూ.2లక్షలు, ప్రభుత్వ వాటా కింద రూ.2 లక్షలతో మంజూరైన ప్యాక్ హౌస్‌లను రైతులు నిర్మించుకున్నారు. అయితే రైతులు డబ్బులు ఖర్చు చేసుకొని పండ్ల తోటల్లో ప్యాక్ హౌస్‌లు నిర్మించుకొని 6 నెలలు అవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు కాలేదు. రైతులు అప్పు చేసి నిర్మించుకున్నారు. ప్యాక్ హౌస్ పనులు పూర్తయినా ఇంత వరకు అధికారులు వాటిని తనిఖీలు చేసి బిల్లులు మంజూరు చేయలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే వాటా కంటే అధికంగా ప్యాక్ హౌస్‌లకు డబ్బులు ఖర్చు చేసినట్లు రైతులు వాపోతున్నారు. వేంపల్లె క్లస్టర్‌లో 12 ప్యాక్ హౌస్‌లు పూర్తయ్యాయి. అధికారులు చెప్పినట్లు తూకం వేసే యంత్రం, నీరు పోయే సదుపాయంతో కూడిన గ్రేడింగ్ టేబుల్, ప్లాస్టిక్ టబ్‌లు, 2,000 లీటర్ల సామర్థ్యం కలిగిన సింథటిక్ వాటర్ ట్యాంక్‌తో పాటు ప్యాక్ హౌస్‌లో బ్యాటరీ వంటి పరికరాలు కూడా సిద్ధం చేశామని రైతులు పేర్కొంటున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిధులు మంజూరులో మాత్రం ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంవల్లే నిధులు మంజూరు కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. పనులు పూర్తయినా ప్రభుత్వం వాటా కింద వచ్చే బిల్లులు చెల్లించక పోవడం విడ్డూరంగా ఉందని రైతులు అంటున్నారు. ఇకనైనా ప్యాక్ హౌస్ బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని కడప డిఎంహెచ్ఒ అడిషనల్ ఆఫీసర్ ఖాదరవలి పేర్కొన్నారు. మండలంలోని నలుపు రెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టిబి, లెప్రసీ, గర్భిణుల వివరాలు అడిగి తెలుసు కున్నారు. రికార్డులు, బయోమెట్రిక్ అటెండెన్స్ పరిశీలించారు. చికిత్స సరిగా అందిస్తున్నారా లేదా అని పలువురు రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిపిఎంఒలు, ఎంపిహెచ్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లను తొలగిస్తున్న జెసిబి

రోడ్డుకిరువైపులా చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు - అంగళ్లు వరకు జరిగే రోడ్డు విస్తరణలో భాగంగా అన్నమయ్య జిల్లా సరిహద్దు నుండి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమం అధికారులు చేపట్టారు. నూతనంగా నిర్మిస్తున్న రెండు రోడ్ల లేన్లుగా అభివృద్ధి చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రోడ్డు వెడల్పు కోసం జెసిబిలతో రోడ్డు కు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, చెట్ల పొదలు, తొలగిస్తున్నారు. ప్రస్తుత రోడ్డును 100 ఫీట్లుగా నిర్మించేందుకు పనులను అధికారులు చేపడుతున్నారు. గ్రామాల్లో రోడ్డు వెడల్పుకోసం భూమిని సేకరిస్తున్నారు. ప్రభు త్వం గ్రామీణ ప్రాంత లింకు రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేయడంతో మండలంలోని పలు గ్రామాలకు మంచి రోజులు రానున్నాయి. **గాలివీడు :** మండల కేంద్రంలో పాత బీటి రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నట్లు ఆర్అండ్‌బి జెఇ గిరీష్‌రావు పేర్కొన్నారు. గాలివీడు నుంచి కరిమిరెడ్డిగారిపల్లి వరకు, గోరాన్ చెరువు నుంచి వడిశలవంకపల్లి వరకు, కుమ్మరపల్లి ఎస్‌సి కాలనీ నుంచి ఎగోవాగోట్టివీడు వరకు రోడ్డుకు ఇరువైపులా అడ్డంకి ఉన్న ముళ్లపొదలు, చెట్లను తొలగిస్తున్నట్లు చెప్పారు.

అక్రమ నిర్మాణాలు చేపట్టినవారిపై చర్యలు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడులో రోడ్డు ఇరువైపులా ఉన్న మురికి కాలువలపై అక్రమంగా నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తప్పవని ఎంపిడిఒ శేఖర్ నాయక్ హెచ్చరించారు. ఇప్పటికే మురికి కాలువ పై అక్కడక్కడ తాపలు నిర్మిస్తున్నారని అన్నారు. కాలువలపైన వాహనాలు పార్కింగ్ చేయకూడదని, కాలువ అవతలి వైపునే ఉండాలని అని పేర్కొన్నారు. వాహనాలపై కాలువలు ఉంచిన వారికి పంచాయతీ అధికారులు నోటీస్ జారీ చేయనున్నారని తెలిపారు.

9 నుంచి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-నందలూరు

ఈనెల 9వ తేదీ నుండి రాజంపేట టిడిపి చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో నందలూరు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు టిడిపి రాష్ట్ర బిసి నాయకులు సమ్మెట శివప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో హార్డ్ టెన్నిస్‌బాల్ మండలస్థాయి క్రికెట్ టోర్నమెంటు సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలలో విజేతలకు 30వేల రూపాయలు, రన్నర్స్‌కు, 20వేలు నగదు బహుమతి, ప్రతిరోజు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులు ఉంటాయని తెలిపారు. టోర్నమెంట్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా తమ జట్టు పేరును ఈనెల 7 వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. పోటీలలో పాల్గొన దలచిన జట్టు 9000527227, 9160608754 నెంబర్లను సంప్రదించాలన్నారు.

జాతీయ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల బృందం

జాతీయ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని ఎపి మోడల్‌స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి అండర్-19 సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి తెలిపారు. ఈనెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు చిన్నమండెంమోడల్ స్కూలలో జరిగిన ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి బాలురు, బాలికలు సాఫ్ట్‌బాల్ పోటీలలో కడప బాలురు మొదటి స్థానం, బాలికల విభాగంలోనూ కడప మొదటి స్థానంలో నిలిచాయి. ఈ పోటీలలో అత్యధిక ప్రతిభ కనపరిచిన పుల్లంపేట మోడల్ స్కూల్లో ఫస్ట్ ఇయర్ సిఇసి విద్యార్థిని మోహన్‌సాయి, సెకండ్ ఇయర్ సిఇసి చదువుతున్న విద్యార్థిని మంజుల జాతీయ జట్టులో చోటు సంపాదించుకోవడం సంతోషంగా ఉందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రతి ఒక్కరూ రాణిం చాలని ముఖ్యంగా మహిళలు క్రీడల్లో రాణించడం ఆనందించాల్సిన విషయమని జాతీయ జట్టుకు ఎంపికైన మంజుల, మోహన్ సాయి అక్కడ కూడా మంచిగా రానించి పాఠశాలకు జిల్లాకు మండలంకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీస్తూ, శిక్షణ ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠంను ఆయన అభినందించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాలివీడు : ప్రజలకు, వ్యాపారస్తులకు, విద్యుత్ వినియోగదారులకు విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా గురువారం తొమ్మిగంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగించారు. గాలివీడు బస్టాండ్ ఆవరణంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి మురికి కాలువలకు అవతల వైపు విద్యుత్ స్తంభాల అమర్చడానికి ఉదయం10 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు విద్యుత్ అంతరాయం కలిగించారు. ముందస్తు సమాచారమివ్వకుండా విద్యుత్‌కు అంతరాయం కలిగించడంతో వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

క్రైం కార్నర్

కోడి పందెం రాయళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

కోడి పందెం ఆడుతున్న కోడి పందెం రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసులు ఇచ్చిన సమాచారం వరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గంగాపురం పంచాయతీ కురవపల్లి సమీపమున కొంతమంది వ్యక్తులు గుంపులుగా ఉండి, గట్టిగా అరుస్తూ కోడిపందెం ఆడుతుండగా అందులో ఐదు మందిని, రెండు కోడిపుంజులను, రూ.9260 రూపాయల నగదు ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. దాడులలో పోలీసు సిబ్బంది తాతయ్య, రాజేంద్ర నాయక్, ఖలీల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా : యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని పత్రవారిపల్లి వద్ద చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ములకలచెరువు మండలం, దేవుల్ చెరువు గ్రామం,రాజుగారిపల్లికి చెందిన గోవిందు కుమారుడు మహేంద్ర తన ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళుండగా పత్రవారిపల్లి వద్దకు చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది. రోడ్డు పక్కన ఉన్న రాళ్లపై మహేంద్ర పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు 108కు సమాచారమిచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గాయపడిన మహేంద్ర